01ATP29F_01ATP29F.qxd 29-01-2025 PM 11:20 Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
గురువారం 30 జనవరి 2025 పేజీలు : 04

## అసత్య ప్రచారాలు నిరూపించకపోతే

# పట్టాల మీద పడుకోబెడతా..!!

మీడియాను హెచ్చరించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

**గుంతకల్లు, జనవరి 29,ప్రభాతవార్త**

అసత్య ప్రచారాలు ప్రచారం చేసి వాటిని నిరూపించకపోతే పట్టాల మీద పడుకోబెడతానని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మీడియా ను హెచ్చరించారు. మంగళవారం ఎమ్మెల్యే మధ్యాహ్నం ఇందిరమ్మ ఇళ్ల స్థలాల లబ్ధిదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మీడియాను ఉద్దేశించి మాట్లాడుతూ.. కొన్ని మీడియా ఛానల్లు తనపై పనిగట్టుకుని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. గత కొన్ని రోజులుగా తన కుటుంబ సభ్యులపై అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కబ్జాకు తమ కార్యకర్తలు పాల్పడలేదన్నారు. తాము ఎవరిని బెదిరించలేదని ఎలాంటి భూకబ్జాలకు పాల్పడలేదన్నారు. ఇలాగే అసత్య కథనాలు ప్రచారం చేస్తే.. కచ్చితంగా పట్టాలపై పడుకోబెడదామని మీడియాను హెచ్చరించారు. నేను ఎన్నో చేసి ఈ స్థాయికి వచ్చానని, దేనికి భయపడనని, ప్రజలకు మంచి చేసేందుకే ఇక్కడికి వచ్చానని చెప్పారు. తనపై కానీ తన కుటుంబ సభ్యులపై గాని ఆరోపణలు వచ్చినప్పుడు మీడియా వారు వివరణ తీసుకొని వార్తలు ప్రచురించాలని కోరారు. వార్త కథనాలు నిజమైతే దేనికైనా సిద్ధమేనన్నారు.ఎమ్మెల్యే మాట్లాడిన మాటలు పలు మీడియాలో వార్త కథనాలు రావడంతో బుధవారం ఎమ్మెల్యే స్పందించి స్థానిక తెలుగుదేశం కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ఒక రెండు ఛానళ్ల తప్పా మిగతా మీడియా సోదరులంతా..తనకు మిత్రులైన అన్నారు. అయినప్పటికీ నేను మాట్లాడిన దాంట్లో ఏమైనా తప్పులు ఉంటే తలదించుకుంటానన్నారు. తన ఎదుగుదలను ఓర్చుకోలేకే కొన్ని చానళ్ల అసత్య ప్రచారాలకు పూనుకున్నారని పేర్కొన్నారు. ఇప్పటికీ తాను అన్న మాటలకు కట్టుబడి ఉన్నానని, అసత్య ప్రచారాలు మానుకోకపోతే.. తాట తీస్తానని హెచ్చరించారు.

## పేరూరు కాలువ నిర్మాణానికి 200కోట్లు, భూసేకరణకు 51 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి

- మంత్రి పయ్యావులతో ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ భేటి - అన్ని అంశాలపై సానుకూలంగా స్పందించిన పయ్యావుల



మంత్రికి పూలమొక్కను అందిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరాం



మంత్రి పయ్యావుల కేశవ్‌తో మట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరాం

**అనంతపురం, జనవరి 29, ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ భేటి అయ్యారు. బుధవారం అనంతపురంలోని పయ్యావుల నివాసానికి వెళ్లి పలు అంశాలపై చర్చించారు. ముందుగా ఎమ్మెల్యే సునీత అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో హంద్రీనీవా అధికారులతో సమావేశం నిర్వహించారు. జీడిపల్లి నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనుల పురోగతి గురించి చర్చించారు. భూసేకరణ, కాలువలు, పంపు హౌస్ లు, రిజర్వాయర్ల నిర్మాణానికి అవసరమైన నిధుల గురించి తెలుసుకున్నారు. సమగ్రమైన సమాచారంతో ఎమ్మెల్యే సునీతతో పాటు ధర్మవరం టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ ప్రత్యేకంగా రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ను కలిశారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అంశాలను మంత్రికి వివరించారు. జీఓ నెంబర్ 59 ప్రకారం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్ట్ వరకు 54కిలోమీటర్లు కాలువ తవ్వాల్సి ఉందన్నారు. గత ఐదేళ్లలో ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. పెండింగ్ పనులు, 4 పంపుహౌస్‌ల నిర్మాణాలతో పాటు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్ట్‌ల నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. ఇందులో భూసేకరణ జరగాల్సి ఉందన్నారు. పేరూరు ప్రాజెక్ట్ కాలువ త్రవ్వకం కోసం చేసిన 266 ఎకరాల భూ సేకరణ పరిహారం బిల్లులు 14కోట్లు సీఎఫ్ఎంఎస్ లు అప్ లోడ్ చేశారని.. నిధులు విడుదల చేయాల్సి ఉందన్నారు. కాలువ భూ సేకరణ కోసం 51 కోట్లు బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. సీఎఫ్ఎంఎస్ పోర్టల్లో భూసేకరణ, కాలువ నిర్మాణం పనుల బిల్స్ అప్లోడ్ చేయడానికి హోల్డ్ ను తీసివేయాలన్నారు. పేరూరు కాలువ పనులు చేపట్టడానికి 2వందల కోట్ల బడ్జెట్ కేటాయించి.. నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు సంబంధించి చర్చించారు. కాలువ లైనింగ్ పనులపై రైతుల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయని.. వీటిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. లైనింగ్ బదులు కాలువ వెడల్పు చేయాలని రైతులు కోరుతున్నట్టు వివరించారు. తప్పనిసరి పరిస్థితుల్లో లైనింగ్ చేయాల్సి వస్తే... కాలువ గట్లకు ఇరు వైపులా చేసి... క్రింది భాగం వదిలేయాలన్నారు. అలాగే ననకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో బాలికల జూనియర్ కాలేజీ మంజూరుకు ఫైనాన్సియల్ క్లియరెన్స్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే సునీత, శ్రీరామ్ చెప్పిన అన్ని అంశాలపై మంత్రి పయ్యావుల సానుకూలంగా స్పందించారు. సీఎం చంద్రబాబుతో పాటు సంబంధిత అధికారులతో వీటిపై చర్చించి త్వరలోనే సానుకూలమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు...

## ప్రభుత్వ సేవలు సద్వినియోగం చేసుకోండి

- నిబంధనలు సడలింపుకు మంత్రిని కలుస్తా... రైతులకు కాలవ విజ్ఞప్తి



కంది కొనుగోలు కేంద్రాన్ని ప్రారంబిస్తున్న ప్రభుత్వవిప్ కాలవ

**రాయదుర్గం రూరల్, జనవరి 29 ప్రభాతవార్త:**

రైతాంగానికి మేలు చేయడానికి పంట ఉత్పత్తుల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల పరిధిలోని 74ఉడేగోళంలో ఏపి మార్క్ ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ కంది కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంబించారు. నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలోని ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. బహిరంగ మార్కెట్లో పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లభించని సమయంలో కనీస మద్దతు ధరపై కొనుగోలుకు ప్రభుత్వం చర్య తీసుకొంటుందన్నారు. దానివల్ల బహిరంగ మార్కెట్లో పోటీ పెరిగి రైతులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. వారి పంట కోత సమయంలోను ఇదే విధంగా కొనుగోలు 3ప్రాంతాలోన్ల కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ చేపట్టడం జరిగిందన్నారు. రైతుల అవసరాల దృష్ట్యా అధనంగా 12,500మెట్రిక్ టన్నుల కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి అనుమతులు ఇచ్చారన్నారు. రైతు సమస్యలంటే ఆయన వెనువెంటనే స్పందిస్తారన్నారు. నేడు అనంతపురం జిల్లా వ్యాప్తంగా 70వేల మెట్రిక్ టన్నుల కంది పంట చేతికి రానుండగా, రాయదుర్గం ప్రాంతం నుండి దాదాపు 5,600మెట్రిక్ టన్నుల దిగుబడి రావచ్చని అధికారులు అంచనా వేశారన్నారు. అయితే చాలా మంది రైతులు తమ పంట ఉత్పత్తిని కొనుగోలు కేంద్రాలకు విక్రయించడానికి ముందుకు రావడం లేదన్నారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 45వేళ మెట్రిక్ టన్నులు కొనటానికి అనుమతి లబించగా కేవలం 4,450మంది మాత్రమే 5603టన్నుల అమ్మటానికి ముందుకు వచ్చారన్నారు. అదే విధంగా రాయదుర్గం వ్యాప్తంగా 457మంది ఏడు వందల టన్నుల కంది అమ్మటానికి రైతు సేవ కేంద్రాల్లో పేర్ల నమోదు చేసుకొన్నారన్నారు. తక్కువ మంది రైతులు ప్రభుత్వ సేవలు వినియోగించుకోవడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం రైతు సంక్షేమ ఆశిస్తూ ఏర్పాటు చేసిన కేంద్రాలను సద్వినియోగం చేఉకోవాలని సూచించారు. గింజలోన్ల తేమ శాతం 12కంటే తక్కువ ఉండాలనే నిబంధనలు కాస్త సడలించాలని రైతులు కోరుతున్నారని చెప్పారు. ఈ అంశాన్ని సంబంధిత శాఖ మంత్రి, ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్ళతానన్నారు. రైతు పక్షాన రైతు శ్రేయస్సు కోరుతున్న చంద్రబాబు ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తునే ఆశాబావం వ్యక్తపరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ ఎంఆర్ఎఫ్ హనుమంతు, అధికారులు, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## వికసిత్ అనంతపురం దిశగా లక్ష్య సాధనకు కృషి చేయాలి

- 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్



కార్యక్రమంలో మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్

**అనంతపురం కలెక్టరేట్, జనవరి 29 ప్రభాతవార్త**

అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం అనంతపురం జిల్లాలో కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌళిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణ్‌శర్మలతో కలిసి సంబంధిత జిల్లా అధికారులతో 20 సూత్రాల కార్యక్రమాల అమలు ఛైర్మన్ లంకా దినకర్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడి లక్ష్యం వికాసిత్ భారత్ 2047 అని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆకాంక్ష స్వర్ణాంధ్ర 2047 అని, ఈ లక్ష్యంతో చేసే కార్యాచరణ ద్వారానే అనంతపురం పార్లమెంట్ పరిధిలోని ప్రస్తుత సవాళ్లను అధిగమించి విజయవంతంగా "వికసిత్ అనంతపురం" దిశగా లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. ఈ సమీక్షలో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, 2019-24 మధ్య జరిగిన అవకతవకలు, ప్రస్తుతం అమలు తీరుపైన, ప్రతి గ్రామ పరిధిలోని ప్రతి గృహానికి సురక్షిత తాగునీరు ఇచ్చే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జల్ జీవన్ మిషన్ అమలు తీరు, అనంతపురం పట్టణంలో అమృత్ పథకం నిధుల వినియోగంతో సాధించిన ఫలితాలు, అమృత్ 2.0 లక్ష్యాలపై, గ్రామీణ సడక్ యోజన, లక్ పతి దీదీ, కళ్యాణ్ అన్న యోజన, పిఎం సూర్యఘర్, కుసుమ్, పిఎం ఆవాస యోజన, పిఎం విశ్వకర్మ, పట్టణ అభివృద్ధి నిధుల వినియోగ ప్రణాళిక, కేంద్ర ప్రయోజిత పథకాల అమలు తీరుతో పాటు జిల్లాను ఎలక్ట్రానిక్ వస్తు తయారీ కేంద్రంగా మలచడానికి ప్రణాళికలు, పారిశ్రామికీకరణ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సంవత్సరం ఉపాధి హామీలో మెటీరియల్ కాంపోనెంట్ 201.63 కోట్లలో ఇప్పటి వరకు 115.76 కోట్లు మాత్రమే వ్యయం అయినందున దాదాపు 85 కోట్లు నిధులు మురిగిపోయే ప్రమాదం వున్నందున ప్రణాళికాబద్ధంగా ఖర్చు చేయాలని అధికారులను ఆదేశించారు. ఒక రోజుకు ఉపాధి హామీ వేతనం 300 రూపాయలు అయితే జిల్లాలో సగటున 263.20 రూపాయలు మాత్రమే మిగిలిన జిల్లాల కన్నా సగటు వేతనం బాగానే చెల్లిస్తున్నప్పటికి ఇంకా పెంచేందుకు కృషి చేయాలన్నారు. గత ఐదు సంవత్సరాలు జల్‌జీవన్ మిషన్ దీర్ఘకాలిక నీటి వనరుల లభ్యత లేకుండా 2019-24 మధ్య పనులు చేయడం వల్ల ప్రధాని నరేంద్రమోడి నిర్దేశించిన లక్ష్యాలు జిల్లా చేరుకోలేకపోయిందని నిధుల దుర్వినియోగం జరిగిందని సమీక్షకు అధికారులు సరైన సమాచారంతో రావాలని ఆదేశించారు. జిల్లాలోని మొత్తం 4.34 లక్షల గ్రామీణ గృహాలకు గాను 3,61,155 గృహాలను పూర్తి చేసినట్లు అధికారులు గణాంకాలు ఇవ్వగా దీర్ఘకాలిక నీటి వనరుల లభ్యత ఆధారంగా పూర్తి అయిన పనులు ఎన్ని అంటే సరైన సమాధానం లేదు. గ్రామీణ సడక్ యోజన కింద గ్రామాల్లో రహదారుల నిర్మాణ పనులు వేగంగా జరగాల్సిన అవసరం వుందని అధికారుల దృష్టికి తేవడం జరిగింది. ఇంకా దీర్ఘకాలంగా ముగిలిపోయిన పాత పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో స్వయం సేవ గ్రూపుల్లోని మహిళలను 97.144 లక్ష్యాధికారులుగా తీర్చిదిద్దాలని లక్ పతి దీదీలుగా పలువురు మహిళలను గుర్తించగా లక్ష్యం వేగంగా అందుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో ప్రతి ఇంటికి సురక్ష తాగునీటి సరఫరా కోసం తాడిపత్రి కార్పోరేషన్ కోసం



హాజరైన అధికారులు

అమృత్ 1.0 కింద 2017 కేటాయించిన నీటి సప్లై అభివృద్ధి పనులకు సంబంధించిన 145.14 కోట్ల నిధులకు సంబంధించి పనుల్లో ఇప్పటి వరకు 67.25 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని పనులకు గాను 66 శాతం మాత్రమే పూర్తి అయ్యాయి. ఇంకా పనులు పూర్తి కానీ పరిస్థితిలో వున్నాయన్నారు. గుంతకల్లు మున్సిపాలిటీ అమృత్ 1.0 ద్వారా ప్రజలకు నీటి సరఫరా కోసం 26.71 కోట్ల రూపాయల ప్రతిపాదనలు చేయడం జరిగిందన్నారు. పిఎం సూర్యఘర్ పథకం అమలులో వేగం పెంచాలన్నారు. ఈ పథకం కింద కనిష్టంగా 30 వేలు, గరిష్టంగా 78 వేలు సబ్సిడీ కేంద్ర ప్రభుత్వం ఇస్తుందని స్వయం సేవ గ్రూపులతో అనుసంధానం అయి నిర్దేశించిన లక్ష్యాలను అందుకోవాలని అధికారులను ఆదేశించారు.

### వ్యవసాయ రంగానికి సాయం :

పిఎం కుసుం ద్వారా నాణ్యమైన నిరంతరాయ వ్యవసాయ విద్యుశ్చక్తి సరఫరా కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం పురోగతి పైన ప్రత్యేక దృష్టి పెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో సకాలంలో ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల పిఎం పసల్ బీమా యోజన ప్రయోజనం 2019-24 మధ్య నష్టపోయిన రైతులకు అందలేదని, కేంద్ర ప్రభుత్వం సహకారంతో లక్షల రైతులు సంవత్సరానికి 6 వేలు కిసాన్ సమ్మాన్ నిధి సహాయం పొందుతున్నారన్నారు. అనంతరం అనేక అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, ఏపిఎంఐపి పిడి రఘునాథరెడ్డి, ఏపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ సంపత్‌కుమార్, సిపిఓ అశోక్‌కుమార్, డిఆర్‌డిఏ పిడి ఈశ్వరయ్య, డ్వామా పిడి సలీంబాష, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారులు ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ నిబంధనల మేరకు నూతన పారిశ్రామిక విధానాన్ని అమలు చేయండి : జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్





సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్, హాజరైన సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకర్లు

**శ్రీసత్యసాయి జిల్లా, జనవరి 29, ప్రభాతవార్త ప్రతినిధి:**

జిల్లాలో నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు అమలు చేయాలని జిల్లా కలెక్టర్ టి.ఎస్.చేతన్ స్పష్టం చేశారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా పరిశ్రమలు మరియు ఎగుమతి ప్రోత్సాహక కమిటీ ( డి ఐ ఈ పి సి ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా పరిశ్రమల శాఖ పనితీరుపై సమీక్షించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రభుత్వపరంగా చేయూత నివ్వాల్సిందిగా సూచించారు. పరిశ్రమల స్థాపన ద్వారా ఆర్థిక ప్రగతి సాధ్యమని, అర్హులైన ఎస్సీ ,ఎస్టీ, బీసీ ,మైనారిటీ ఓసి మరియు మహిళలకు ప్రభుత్వ మార్గదర్శకాలు పై అవగాహన కల్పించి ఉత్పత్తి మరియు సేవారంగం పరిశ్రమల స్థాపనకు సంబంధించి వీలైనంతగా ప్రోత్సహించాలని ఆదేశించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహకాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించిందని కలెక్టర్ తెలిపారు. అదే స్ఫూర్తితో జిల్లా లో కూడా పారిశ్రామిక రంగాన్ని మరింతగా పటిష్టం చేయాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల స్థాపన కొరకు (ఎంఎస్ఎంఈ) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై చైతన్య పరచాలని సూచించారు. ప్రస్తుతం సింగల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలన్నారు. అలాగే జిల్లాల పరిశ్రమల అనుమతుల కోసం వచ్చిన దరఖాస్తులు మరియు ఆమోదం పొందిన దరఖాస్తుల వివరాలను జిల్లా కలెక్టర్ అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. నిర్దిష్ట గడువు వరకు వేచి చూడకుండా సత్వరమే ప్రభుత్వ నిబంధన మేరకు అనుమతులు మంజూరు చేయాలన్నారు. పిఎంఈజీపి పథకం కోసం వచ్చిన దరఖాస్తులను వెంటనే బ్యాంకులకు పంపాలని, ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్న ఎమ్మెస్ సర్వేలను త్వరతగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిశ్రమలకు సంబంధించి పెట్టుబడి, విద్యుత్తు, వడ్డీ రాయితీ లకు 12 క్లైములకు సంబంధించి రూ. 40 లక్షలు జిల్లా కలెక్టర్ సమావేశంలో మంజూరు చేశారు. జిల్లాలో పారిశ్రామిక రంగాన్ని పటిష్టం చేసి మరింత విస్తృత పరిచేందుకు అన్ని అనుబంధ శాఖలు సమన్వయంతో పనిచేస్తూ జిల్లా ఆర్థిక ప్రగతి కి దోహదపడాలన్నారు. అలాగే పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. మరి ముఖ్యంగా కొత్తగా పారిశ్రామిక రంగంలోకి అడుగుదాలనుకున్న వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని అందించేలా బ్యాంకర్లు కూడా తమవంతుగా పూర్తి సహకారాన్ని అందించాలని కలెక్టర్ కోరారు. జిల్లాలో పరిశ్రమ స్థాపనకు సంబంధించి ఇంకా ఏమైనా దరఖాస్తులు పెండింగ్లో ఉన్నట్లయితే వాటిని కూడా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సింగల్ డెస్క్ పోర్టల్ లో పెండింగ్ లో ఉన్న 14 పరిశ్రమల స్థాపనకు సంబంధించి జిల్లా కాలుష్య నియంత్రణ మండలి మరియు ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ శాఖలు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పీఎంఈజీపి ద్వారా జిల్లాకు కేటాయించిన 72 క్లైమ్ లు లక్ష్యం కాగా ఇందులో అదనంగా 16 క్లైమ్ లు రావడం పై జిల్లా కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీఐసీసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, ఐపీఓ సంజీవరాజు, డిపిఓ సమత, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగప్రసాద్, ఎల్ డి ఎం రమణ కుమార్, నాబార్డ్ ఏజీఎం అనురాధ, ఏపీ ఎఫ్ ఎఫ్ సి ప్రకాష్, డిక్కీ జోనల్ ప్రెసిడెంట్ కోలా వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## గుమ్మనూరు జయరాంపై టిడిపి అధిష్టాన వర్గం సీరియస్

- ఇది మన పార్టీ పద్ధతి కాదని హెచ్చరిక - భగ్గుమన్న జర్నలిస్ట్ సంఘాలు

**అనంతపురం, జనవరి 29, ప్రభాతవార్త బ్యూరో**

మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పై తెలుగుదేశం పార్టీ అధిష్టాన వర్గం సీరియస్ అయింది. పాత్రికేయుని బెదిరించడం మన పార్టీ సాంస్కృతి కాదని, ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని ఎమ్మెల్యేని హెచ్చరించింది. టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు ఎమ్మెల్యేకి ఫోన్ చేసి చివాట్లు పెట్టినట్లు సమాచారం.. అనంతపురం జిల్లా గుంతకల్లు టిడిపి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం మంగళవారం రోజు విలేకరులపై నోరు పారేసుకున్నారు.. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం గుంతకల్లు విలేకరులతో ఏమన్నాడంటే నేను అన్ని చేసి వచ్చినొన్ని.. రాసుకోండి ..ఏం రాసుకుంటారో. తప్పు చేస్తే రాయండి.. ఆధారాలు లేకుండా రాస్తే తాటతీస్తా అని బహిరంగ హెచ్చరించారు.. ఈ విధంగా ఎలక్ట్రానిక్ మీడియా ,పత్రిక ప్రతినిధులకు గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బహిరంగంగా వార్నింగ్ ఇవ్వడం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. తనపై వివాదాలు రాస్తే రైలు పట్టాలపై పడుకోబెట్టి చంపుతానని కూడా ఎమ్మెల్యే హెచ్చరిక చేశారు. కొంతమంది నాకు వ్యతిరేకంగా వార్తలు రాస్తున్నారు .నా కుటుంబ పెత్తనం ఉందని అంటున్నారు .భూ అక్రమాలు చేశాను అని చెబుతున్నారు .వీటన్నింటినీ నిరూపించాలి లేదంటే.. రైలు పట్టాలపై పడుకోబెడతారని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హెచ్చరిక చేశారు.. ఈ సంఘటన పై ఏపీడబ్ల్యూజే, ఇతర జర్నలిస్ట్ సంఘాలు భగ్గుమన్నాయి.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇతర రాజకీయ పార్టీని కూడా ఎమ్మెల్యే తీరిన తప్పు పట్టాయి.. టిడిపి అధిష్టానం కూడా సీరియస్ అయింది..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

## జిల్లాలోని ప్రతి అన్న క్యాంటీన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించాలి

-జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

**అనంతపురం కలెక్టరేట్, జనవరి 29 ప్రభాతవార్త**

జిల్లాలోని ప్రతి అన్న క్యాంటీన్‌కు ఒక నోడల్ అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. బుధవారం అనంతపురం పట్టణంలోని జూనియర్ కళాశాల వద్దనున్న అన్న క్యాంటీన్, బళ్లారి బైపాస్ వద్ద వున్న అన్న క్యాంటీన్‌ను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. బళ్లారి బైపాస్ వద్ద వున్న అన్న క్యాంటీన్‌లో స్వయంగా కౌంటర్ దగ్గరికి వెళ్లి టోకన్ తీసుకుని లైన్‌లో నిలబడి అన్నం పెట్టించుకుని సామాన్య ప్రజలతో కలిసి జిల్లా కలెక్టర్ భోజనం చేసి అనంతరం ప్లేట్‌ను శుభ్రపరిచారు. ఇందులో భాగంగా భోజనం నాణ్యతగా వుందా అంటూ ప్రజలతో ఆరా తీశారు. భోజనం బాగుందని ప్రజలు తెలిపారు. అనంతరం భోజనం తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడ బియ్యం ఇతర వస్తువులు నాణ్యతగా వున్నాయా లేదా అంటూ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.వినూత్న, మున్సిపల్ కమీషనర్ మల్లికార్జున, మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



భోజన నాణ్యతను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

## జాతరలో దీపిక వేణు ప్రత్యేక పూజలు

### ఘనంగా వివాహ వేడుకలు





పూజల్లో పాల్గొన్న దీపిక వేణురెడ్డి

హిందూపురం జనవరి 29 ప్రభాతవార్త

మండలంలోని తూము కుంట గ్రామంలో జరుగుతున్న మారెమ్మ జాతర వేడుకల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దీపిక వేణురెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామదేవత మారెమ్మ ఆశీస్సులతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. అంతకుముందు పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కార్యాలయంలో దీపికా వేణురెడ్డి వివాహ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టి వైసిపి శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. భారీ పూలమాలలు, పుష్పగుచ్చాలతో వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ కమిటీ అధ్యక్షులు శివకుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జేబివుల్లా, మండల కన్వీనర్ రాము, మున్సిపల్ కౌన్సిలర్లు రామచంద్ర, చంద్రశేఖరరెడ్డి, మార్కెట్ చాంద్, జనార్ధన్ రెడ్డి, మనేసముద్రం గిరి, ఎస్టీ సెల్ శంకరయ్య, బిట ధనంజయ రెడ్డి, తిప్పే రుద్రయ్య, ఫరుక్, అయూబ్, మనోజ్, శబరీష్ రెడ్డి, కొటిపి శ్రీనివాస్ రెడ్డి, ప్రణయ్ రెడ్డి, మొదలగువారు పాల్గొన్నారు.

## గడ్డివామి దగ్ధం

బ్రహ్మసముద్రం జనవరి 29 ప్రభాతవార్త



కాలి బూడిదైనా గడ్డివాము

మండలంలోని బైరసముద్రం గ్రామంలో బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగి 3ట్రాక్టర్ల వేరుశనగ పొట్టు గడ్డి రైతు సూరయ్య గారి ఏరిస్వామి పశుగ్రాసం పూర్తిగా కాలి బూడిద అయ్యాయి గడ్డి వామి దగ్ధంఅవ్వడంతో రైతులు రైతుకుసుమారు 50వేల దాకా నష్టం వాటిల్లిందని అన్నారు గ్రామస్తులు రైతుల సహాయంతో మంటలు ఆర్పి నివారించారు.

## ఉపాధి కూలీల శాతం పెంచండి ఎంపీడీవో నందకిషోర్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

బ్రహ్మసముద్రం జనవరి 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన ప్రతి బుధవారం జరుగు ఉపాధి హామీ పథకం రివ్యూ మీటింగ్ నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నందకిషోర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు ఉపాధి కల్పించి కూలీల శాతం పెంచాలని అన్నారు మండల వ్యాప్తంగా ఉన్న పశువుల షెడ్లు త్వరితగతిన పూర్తి చేసి బిల్లులు పెట్టాలని అన్నారు అనంతరం ఏపీవో పండరీష్ మాట్లాడుతూ గ్రామాలలో ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల శాతం వారి హాజరు దానికి సంబంధించి ప్రతిరోజు పరిశీలించి ప్రతి ఒక్కరికి రోజువారి కూలీ అందేలా చూడాలని అన్నారు ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు ఫీల్డ్ అసిస్టెంట్ల పాల్గొన్నారు.

## మృతుని కుటుంభానికి ఆర్థిక సాయం

కళ్యాణదుర్గం రూరల్ జనవరి 29 ప్రభాతవార్త



అంజనప్ప పార్తివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి 15000 రూపాయలు నగదు అందజేస్తున్న దృశ్యం

మండల పరిధిలోని బోరంపల్లి గ్రామం సచివాలయ క్లాప్ మిత్ర ఉద్యోగి ,హరజన అంజనప్ప కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాద పడుతు మంగళ వారం రోజున సాయంత్రం మృతి చెందాడు, విషయం తెలుసుకున్న వైఎస్ఆర్సిపి నాయకులు వంక సోమశేఖర్ రెడ్డి కృష్ణారెడ్డి సచివాలయ సిబ్బంది హరజన అంజన్నప్ప పార్తివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం అంజనప్ప కుటుంబానికి వైఎస్ఆర్సిపి నాయకులు 10,000 రూపాయలు సచివాలయ ఉద్యోగులు 5000 వేలురూపాయలు ,మొత్తం 15000 వేలు రూపాయలు నగదు మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు, ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు, సచివాలయ సెక్రెటరీ నవీన్, విఆర్ఓ జవహర్ భాష, హెల్పర్ అసిస్టెంట్ చెన్నకేశవ, ఏఎన్ఎం సరోజమ్మ పాల్గొన్నారు.

## మాల్యంలో రోడ్డు పైకి మురికి నీరు...చర్యలు చేపట్టండి సార్

కణేకల్లు, జనవరి 29 ప్రభాతవార్త:



మురుగు నీటిని చూపుతున్న దృశ్యం.

కణేకల్లు మండలము మాల్యం గ్రామం నందు ఫిబ్రవరి నె 3,4,5 తేదీ వరకూ శ్రీ సుంకులమ్మ దేవాలయం ఉత్సవాలు జురుగుతాయని, 4వ తేదీన శ్రీ సుంకులమ్మ రథోత్సవం పురవీధుల గుండా రథోత్సవం కార్యక్రమం జరుగును. అయితే ఈ గ్రామం నందు పురవీధుల గుండా మురికి నీరు ఏరులై పారుతున్నది. కావున పంచాయితీ కార్యదర్శి, శానిటేషన్ వారు మరియు ఎంపీడీఓ దృష్టికి కణేకల్లు మండల బీజేపి నాయకులు తీసుకెళ్ళారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అధికారులను, ఇంజనీరింగ్ అసిస్టెంట్ హనుమంతుకి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపి మండల అధ్యక్షుడు కెతిప్పేస్వామి మరియు బీసేపి మాజీ మండల అధ్యక్షుడు మల్లయ్య, చౌదరి, జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్, బీజేపి కార్యవర్గ సభ్యులు కె.చిక్కన్న, బజరంగదళ్ మండల అధ్యక్షుడు రమేష్, క్రాంతి కుమార్ యాదవ్, సంతోష్ కుమార్, టిడిపి సీనియర్ నాయకులు కురుబ వండ్ర తదితరులు పాల్గొన్నారు.

## సహకార సంఘం రద్దు చేయవద్దని కాలవన్నకు వినతి

డి.హీరేహాళ్, జనవరి 29 ప్రభాతవార్త:



ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు వినతిపత్రం ఇస్తున్న తెదేపా నాయకులు.

ఓబుళాపురం ప్రాధమిక సహకార సంఘంను రద్దు చేయకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, రాయదుర్గం శాసనసభ్యులు కాలవ శ్రీనివాసులకు మండల తెలుగుదేశం నాయకులు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఓబుళాపురం తెదేపా సీనియర్ నాయకులు రామకృష్ణ, మాజీ సర్పంచ్ సత్యప్పగారి వెంకటేశులు, తెదేపా గ్రామ ఉపాధ్యక్షులు కందారు దురుగప్ప, డీలర్ బించే బసప్ప, మల్లికేతి తాయప్ప, మాజీ డీల్ బెళగల బసవరాజ్, బసప్ప తదితరులు మాట్లాడుతూ ఓబుళాపురం ప్రాథమిక సహకార సంఘంను రద్దు చేస్తామని జిల్లా సహకార సంఘాల అధికారులు నోటీసులు జారీ చేశారన్నారు. ఈ విషయమై ఓబుళాపురం ప్రాథమిక సహకార సంఘం సంబంధిత అధికారులను విచారించగా ఈ ప్రాథమిక సంఘంలో ఎటువంటి లావాదేవీ లేనందున దీనిని మూసివేయాలని పై అధికారులు నోటీసులు ఇచ్చారని, అందువలన రద్దు చేస్తామని తెలిపారన్నారు. ఈ విషయమై జిల్లా సహకార సంఘాల అధికారి, అనంతపురం వారిని విచారించగా వారు కూడా ఓబుళాపురం ప్రాథమిక సహకార సంఘంను రద్దు చేస్తామని తెలిపారని కాలవకు తెలియజేశారు. ఈ విషయమై అనంతపురం జిల్లా సహకార సంఘాల అధికారి (డిసిఒ)తో కాలవ శ్రీనివాసులు వెంటనే చర్చించి ఓబుళాపురం ప్రాథమిక సహకార సంఘం రద్దు చేయకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## బి. నాగరాజు మృతికి నివాళులు

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 29 ప్రభాతవార్త:



బి. నాగరాజు ఫైల్‌ఫోటో

కళ్యాణదుర్గం రెవెన్యూ కాలనీ రోడ్డు లో నివాసమున్న బి.నాగరాజు బుధవారం స్వర్గస్తులయ్యారు ఆయన కళ్యాణదుర్గం ఎస్టీ హాస్టల్ నందు పనిచేస్తూ ఉండేవారు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థిస్తున్నట్లు రూహుల్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నన్ను ప్రతిరోజు సాయంకాలం ఐదు గంటలకు నారాయణ స్కూల్ దగ్గర ఆప్యాయంగా మాట్లాడేవారు, భాషా, భాషా అని సంభోదించేవారు ఆయన కుమారుడు ఆరవ తరగతి చదువుతున్నాడు, మంగళవారం కూడా ఐదు గంటల సమయానికి మాట్లాడారు సంభాషణల అనంతరం వెళ్ళొస్తా భాషా అని ఆప్యాయగా మాట్లాడారు. ఆయన ఇప్పుడు ఈ లోకంలో లేరు, శోకసప్త హృదయంతో చాలా బాధగా ఉందన్నారు.

## బ్రహ్మసముద్రం నుండి చేలగురికి ఎర్రితాత స్వామి సన్నిదానికి పాదయాత్ర 40 మంది స్వాములు



పాదయాత్రతో బయలుదేరుతున్న స్వాములు.

కణేకల్లు, జనవరి 29 ప్రభాతవార్త:

కణేకల్లు మండలం బ్రహ్మసముద్రం గ్రామం నుండి అమావాస్య సందర్భంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురుస్వామి గోవింద స్వామి, వెంకటేష్ స్వామి, తుంబిగనూరు విజయ స్వామి, సంతోష్ వన్నూర్ స్వామి, ఎర్రగుంట రమేష్ స్వామి, బెనకల్ గౌవసిద్దస్వామి, పెద్దన్నస్వామి, లాలుస్వామి, కణేకల్‌వాసుస్వామి, ఉడేగోళం సురేంద్ర స్వామి, బొజ్జ స్వామి, పాదయాత్ర నిర్వహించారు. బ్రహ్మసముద్రం నుండి 40 మంది శివమాల వేసిన స్వాములు కాలినడకన ఎర్రితాత దేవాలయానికి నడిచి వెళ్ళారు, అక్కడికి చేరుకొని పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

## లక్షకు పైగా పట్టాభిరామ బ్రహోత్సవ ఆహ్వానం పత్రికలు

### ఆలయ ఛైర్మన్ దేవినేని అవినాష్

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 29 ప్రభాతవార్త:



ఆహానపత్రికలను చూపిస్తున్న దృశ్యం.

కళ్యాణదుర్గం శ్రీ పట్టాభిరామ స్వామి బ్రహోత్సవాలకు లక్షకు పైగా ఆహ్వాన పత్రికలు ముద్రించి తీసుకువచ్చినట్లు ఆలయ ఛైర్మన్ దేవినేని అవినాష్ తెలిపారు. ఈ సందర్భంగా పార్టీలకు అతీతంగా కనివిని రీతిలో ఉత్సవాలు జరుపుకుందామని ప్రతి ఇంటికి రాముల వారి ఆహ్వాన పత్రిక చేరేలా చూడాలని ఆయన కమిటీ సభ్యులకు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఆలయ ఛైర్మన్ దేవినేని అవినాష్ జబర్దస్త్ టీమ్, తెనాలి వారిచే రామాయణం డ్రామా ప్రముఖ లచే ప్రవచనలతో పాటు వివిధ కార్యక్రమాలు ఏర్పాటు చేయడంతో ఈ సారి బ్రహోత్సవాలు భక్తులకు అంచనాలు పెరిగాయి.

## గడ్డి వాము దగ్ధం

రాయదుర్గం, జనవరి 29 ప్రభాతవార్త:



అగ్నికి ఆహుతవుతున్న గడ్డివాము

రాయదుర్గం సమీపంలోని బిటిపి లేఅవుట్ సమీపంలో ఉన్న చర్చి పక్కన ఉన్న గడ్డి వాము గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో గడ్డి వాము దగ్ధమైంది. అబ్దుల్ రహుఫ్ పశువులు కోసం మొక్కజొన్న గడ్డిని బిటిపి రోడ్డు చర్చి పక్కన ఉన్న లేఅవుట్‌లో గడ్డివాము వేసినట్లు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు అంటించడంతో పూర్తిగా కాలిపోయి సూమారు రూ.30వేల వరకూ నష్టము జరిగిందని అన్నారు. ప్రభుత్వం వారు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు.



ఇంట్లో ఉరివేసుకున్న రాజేష్

## ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం టౌన్, జనవరి 29 ప్రభాతవార్త:

పట్టణంలో బ్రెనిస్టార్ స్కూల్ సమీపంలో అప్పుల బాధలు తట్టుకోలేక యువకుడు రాజేష్ (32) ఇంట్లో ఉరి వేసుకొని మృతి, చెడు వాసన రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చిన కాలనివాసులు, ఘనటపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మూడు రోజుల నుండి విద్యుత్ సరఫరా బంద్

### తీవ్ర ఇబ్బందుల్లో రైతులు ప్రజలు...

రాయదుర్గం, జనవరి 29 ప్రభాతవార్త:



మరమ్మతులు చేస్తున్న కార్మికులు

రాయదుర్గం మండలంలోని పల్లెపల్లి గ్రామంలోని సబ్‌స్టేషన్ నుండి మల్లాపురం, మెచ్చిరి, పల్లేపల్లి, కల్యం గ్రామలకు గత మూడు రోజులుగా విద్యుత్‌సరఫరా అంతరాయం ఏర్పడింది. దీంతో రైతులు తమ పంటలను కాపాడుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కనీసం తాగునీరు కూడా విద్యుత్ సరఫరా చేయడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గత మూడు రోజుల క్రితం సిబ్బంది అనాలోచిత నిర్ణయం వల్ల బళ్లారి రోడ్డు నందు ముఖద్వారం వద్ద రైల్వేలైన్ కింది భాగాన ఏర్పాటుచేసిన కేబుల్ కిట్టు పాడైపోవడంతో ఈ ఇబ్బందులు ఏర్పడినట్లు ఏఈ బాలచంద్ర తెలిపారు. దాన్ని మరమ్మత్తు చేయడానికి గత మూడు రోజుల నుండి విద్యుత్ సిబ్బంది పనిచేస్తున్న విద్యుత్ అందుబాటులో లేకపోవడంతో రైతులు నివాస గురవుతున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పెరిగిన టెక్నాలజీ ఉపయోగించుకోకుండా పాత పద్దతిలోనే పనులు చేపట్టడంతో ఆలస్యం కానున్నట్లు రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎండిపోతున్న పంటలను కాపాడుకోలేక రైతులు ఆందోళన చెందుతున్నారని, కేబుల్ లైనోన్ల రైల్వేలైన్ కింద భాగాన ఏర్పాటు చేయడంతో తరుచూ మూన్నెలకోసారి ఈ సమస్య ఏర్పడుతుందని దాన్ని మరమ్మత్తు చేయడానికి కనీసం మూడు రోజులది సమయం తీసుకుంటున్నట్లు సిబ్బంది తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇకముందు ఇలాంటి సమస్య తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

డి.హీరేహాళ్, జనవరి 29 ప్రభాతవార్త:



రోడ్డు ప్రమాదంలలో మృతి చెందిన గోవిందరెడ్డి ఫైల్‌ఫోటో

మండల పరిధిలోని జాజరకల్లు గ్రామ శివారుల్లో జరిగిన రోడ్డు ప్రమాదంలో గోవిందరెడ్డి(58) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మృతుడు జాజరకల్లు గ్రామ శివారులోన్ల ఉన్న తన సొలానికి మోటార్‌సైకిల్‌లో వెళుతుండగా ముందుర వెళ్లే బొలెరో వాహనాన్ని వెనుక నుండి ఢీ కొట్టడంతో గోవిందరెడ్డి ఎదకు గాయాలు కాగా బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మధ్యాహ్నం మృతి చెందడంతో అతని భార్య పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేపడుతున్నట్లు ఎస్సై చెప్పారు.

## రైతు శివన్న పొలంలో 40 మీటర్ల కేబుల్ వైరు చోరి

మడకశిర జనవరి 29 ప్రభాతవార్త;



రైతు శివన్నకు చెందిన స్టార్టర్ కేబుల్

మండల పరిధిలోని బుళ్ళసముద్రం రైతు శివన్నకు చెందిన పొలంలో మంగళవారం రాత్రి సుమారు 40 మీటర్ల వైరును గుర్తుతెలియని వ్యక్తులు కోసుకొని తీసుకెళ్లినట్లు ఆయన తెలియజేశారు. గత 6 నెలల క్రితం కేబుల్ వైరుతో పాటు స్టార్టర్‌ను కూడా తీసుకెళ్లారని మరి ఇప్పుడు ఇంకొక సారి దొంగతనం చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. తాను ప్రస్తుతం చామంతి, వేరుశనగ, కూరగాయలు పంటలు వేశానని నీళ్లు లేకపోతే పంటలు ఎండిపోయి తాను నష్టపోతానని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇలా జరిగితే రైతులు పంటలు పెట్టాలంటే భయపడుతున్నారని తమ కుటుంబాలను పోషించాలంటే వ్యవసాయం పైనే ఆధారపడాల్సి వస్తుందని కాబట్టి ఇలాంటివి పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

## ఫిబ్రవరి నుండి మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమం



విలేకరుల సమావేశంలో గుమ్మనూరు నారాయణ మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, జనవరి 29 ప్రభాతవార్త

మున్సిపల్, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఫిబ్రవరి మొదటి వారం నుండి మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు టిడిపి నాయకులు గుమ్మనూరు నారాయణ, పట్టణాధ్యక్షులు ఎంకె చౌదరి పేర్కొన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ, రూరల్ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం గుంతకల్లు నియోజకవర్గం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఆధ్వర్యంలో మన ఊరు మన ఎమ్మెల్యే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. గ్రామాల్లో మున్సిపాలిటీలో రోజుకు రెండు సచివాలయాల అధికారులతో కలిసి విజిట్ చేసి అక్కడే రెవెన్యూ సంబంధించిన సమస్యలు గ్రామంలో నెలకొన్న సమస్యలు అభివృద్ధి పనులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు ఒక వేదికగా ఈ కార్యక్రమన్ని నిర్వహిస్తున్నామన్నారు. హంగు ఆర్భాటం లేకుండా ఆయా గ్రామాలకు చెందిన వారు ఆయా వార్డుకు సంబంధించిన వారు మాత్రమే ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చేపడుతున్నామన్నారు. అధికారుల సమక్షంలో రోడ్లు గాని, డ్రైనేజీలు గాని రెవెన్యూ సంబంధించిన సమస్యలు వున్న సాధ్యమైనంత వరకు అక్కడే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. మున్సిపాలిటీలో ఆయా వార్డుల్లో రోజుకు రెండు సచివాలయాల్లో పర్యటిస్తమన్నారు. అయితే రాబోయేది ఎండాకాలం కావడంతో నీటి సమస్య తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకునేందుకు అధికారులతో కలిసి సమీక్షించి నిర్ణయం తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా హౌసింగ్ సంబంధించి బిసి, ఎస్‌సి కార్పొరేషన్‌లో సంబంధిత అర్హులైన లబ్దిదారులను ఎంపిక చేసి నిర్ణయించడం కూడా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఆయా గ్రామ, వార్డు పార్టీ నాయకులు, కార్యకర్తలు, పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు ప్రతాప్, రమేష్, రవితేజ, రవి, చికెన్ శీనా, న్యాయవాది సోమశేఖర్, కృష్ణయ్య, సంపత్, దిల్‌కా శీనా, తదితరులు పాల్గొన్నారు.

## రెండు గ్రామాల్లో వైద్య శిభిరాలు

బెలుగుప్ప, జనవరి 29 ప్రభాతవార్త

మండల పరిధిలో శ్రీరంగపురం, వెంకటాద్రిపల్లి గ్రామాల్లో శ్రీ సత్యసాయి సేవా సమితి సహకారంతో పశువైద్య శిభిరాన్ని నిర్వహించినట్లు డాక్టర్లు రమేష్, స్రవంతిలు తెలిపారు. ఆ గ్రామాల్లో పశువులకు, గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులు, మినరల్ మిక్చర్ లాంటివి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ.. గ్రామాల్లో మందులను పంపిణీ చేయడం వల్ల పశువులకు, గొర్రెలకు, మేకలకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ ఈ వైద్య శిభిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సునీల్ చౌదరి, జయరామ్‌చౌదరి, ఓం సాయిప్రకాష్, రాజావలి, హాజీవలి, సోమశేఖర్, గోపాల్, పశువైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జిఎస్ఎల్‌వి-ఎఫ్ 15 విజయవంతంపై సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు హర్షం



బెలుగుప్ప, జనవరి 29 ప్రభాతవార్త

భారతదేశ అంతరిక్ష సంస్థ జిఎస్ఎల్‌వి-ఎఫ్ 15 100వ ప్రయోగం విజయవంతం కావడంపై సన్‌రైజర్స్ పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మారెన్న, విశ్రాంతి ఉపాధ్యాయుడు ఎస్.నాగరాజు ఆధ్వర్యంలో ఇస్రో సంస్థ చేసిన సేవలపై విద్యార్థులకు క్షుణ్ణంగా తెలియజేశారు. విద్యార్థులు కూడా జయహో ఇస్రో అంటూ నినాదాలు చేశారు. బుధవారం ఉదయం 6:23 గంటలకు నింగిలోకి వెళ్లి కక్షలోకి దింపడం వల్ల 3,600 కిలోమీటర్ల దూరంలో ఈ శాటిలైట్ ప్రయోగించడం వల్ల ఆ దృశ్యాలను విద్యార్థులు ప్యానల్‌లో తిలకించారు. ఈ శాటిలైట్ ద్వారా ఆర్మి, నావిక, ఇపత్తుల గురించి తెలియజేస్తుందని తెలియజేశారు. మిసైల్ ఆఫ్ ఇండియా మ్యాన్‌గా డా.అబ్దుల్ కలాం గురించి కూడా ఈ దేశ అభివృద్ధి చేయడానికి ఎంతో కృషి చేశాడని, విద్యార్థులకు తెలియజేశాడు. అన్ని దేశాల కన్నా మన దేశం అభివృద్ధి దిశలో పయనిస్తుందని విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగభూషణ, తిప్పేస్వామి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## పిహెచ్‌సిలో వైద్య సేవలపై ఆందోళన

చిలమత్తూరు, జనవరి 29 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో వైద్య సేవలందించడంలో అవగాహన లేని వారిచే క్షతగాత్రులకు కట్లు కడుతున్నారని ఆందోళన చేసిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా వున్నాయి. ద్విచక్రవాహనంకు అడ్డంగా కుక్క దూరడంతో వాహనం నడుపుతున్న మాజీ ఎంపిపి గౌరిశంకర్ కిందకు పడడంతో ముఖానికి, మోకాలికి గాయాలయ్యాయి. క్షతగాత్రున్ని వెంటనే సమీపాన గల ఆసుపత్రికి తరలించగా వైద్యుడు డాక్టర్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో స్టాఫ్ నర్సు ప్రథమ చికిత్స చేశారు. అయితే కట్లు కట్టే విషయంలో అనుభవంలేని వ్యక్తితో పని చేయించడం పట్ల కొంత మంది స్టాఫ్‌నర్సు కట్లు కట్టొచ్చు కదా అని ప్రశ్నిస్తూ ఆందోళన చేశారు. ఈ విషయంపై ప్రభాతవార్త డాక్టర్ తేజశ్వినిని వివరణ కోరగా తాము వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించలేదని డాక్టర్ రామకృష్ణ స్వయంగా చికిత్స చేశారని కట్లు కట్టే పోస్టులు భర్తీ కాకపోవడంతో అత్యవసర సేవల నిమిత్తం మరొకరు కట్లు కట్టారని వివరించారు.

## ప్రభుత్వ ఆసుపత్రులను తనిఖీ చేసిన జోనల్ మలేరియా అధికారి



అధికారులతో మాట్లాడుతున్న జోనల్ అధికారి

గోరంట్ల, జనవరి 29 ప్రభాతవార్త

గోరంట్ల పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రితో పాటు కొండాపురం వద్ద గల ప్రభుత్వ ఆసుపత్రిని జోనల్ మలేరియా అధికారి లక్ష్మానాయక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా ఆసుపత్రుల్లో ఆయన రక్త పరీక్ష నమూనాలు, రికార్డులను ఉద్యోగుల హాజరు పట్టిక పరిశీలన, మలేరియా సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు వాసు, మాధవిలతో పాటు ఆరోగ్య విస్తరణాధికారి రమణ, నీలవేణి, గంగాధర్, రసూల్, గంగులమ్మ, పూజయ్య, బాష, తదితరులు పాల్గొన్నారు.

## స్వయం ఉపాధి పథకం కొరకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి(కల్చరల్), జనవరి 29, ప్రభాతవార్త

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు స్వయం ఉపాధి పథకం ద్వారా సబ్సిడీ రుణాల కొరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా అధికారులు ఓ ప్రకటనలో తెలియజేశారు. బిసి, ఇబిసి, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు(బలిజ) కులాలకు చెందిన వారు మరియు జనరిక్ మందుల షాపు నిర్వహణకొరకు బిఫాంసీ, డిఫాంసీ చేసిన బిసి, ఈబిసి నిరుద్యోగ యువత దరఖాస్తుచేసుకోవచ్చన్నారు. ఇందుకు సంబంధించి ఎపిఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 30వ తేది నుండి ఫిబ్రవరి 07లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. తదుపరి 08వ తేది నుండి 11వ తేది వరకు స్క్రూటిని జరుగుతుందని, 12 నుండి 14వ తేదిలోపు ఫీల్డ్ వెరిఫికేషన్, 15,16 తేదీలో అనర్హుల దరఖాస్తులు తొలగిచండం, 17 నుండి 20వ తేదిలోపు ఓబిఎంఎంఎస్ పోర్టల్ ద్వారా ఎంపిడిఓలు, మున్సిపల్ కమీషనర్లచే దరఖాస్తులు సబ్మిషన్, 21వ తేది నుండి 23వ తేదిలోపు జిల్లాకలెక్టర్ చే అప్రూవల్, 26 నుండి 28వ తేదిలోపు సబ్సిడీ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలకు జమచేయడం, మార్చి 1వ తేది నుండి 5వ తేదిలోపు బ్యాంకులలో డాక్యుమెంట్ల సబ్మిషన్, మార్చి 6 నుండి 9వ తేదిలోపులబ్ధిదారుల ఖాతాల్లోకి లోన్ మరియు సబ్సిడీ మొత్తాలు జమచేయడం, మార్చి 10వ తేది నుండి 20వ తేదిలోపు సదరు యూనిట్‌లను రుణమేళా ద్వారా జిల్లా కలెక్టర్, ఆయా నియోజకవర్గ ప్రజా ప్రతినిధులచే అధ్యాయనం చేయడం, ఏప్రిల్ 3వ తేది నుండి 10వ తేదిలోపు జియోట్యాగింగ్, ఫోటోల అప్‌లోడ్ 11 నుండి 20వ తేదిలోపు అసెట్ వెరిఫకేషన్, ఎవల్యూషన్ చేయడం జరుగుతుందని తెలియజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా బిసి కార్పొరేషన్ క్రింద 1472 యూనిట్లు, 30జనరిక్ మందుల షాపులు, ఈబిసి క్రింద 86 యూనిట్లు, 14 జనరిక్ మందుల షాపులు, కమ్మ కార్పొరేషన్ క్రింద 49 యూనిట్లు, 8 జనరిక్ మందుల షాపులు, రెడ్డి కార్పొరేషన్ క్రింద 24 యూనిట్లు, 4 జనరిక్ మందుల షాపులు, ఆర్యవైశ్య కార్పొరేషన్ క్రింద 17 యూనిట్లు, 3 జనరిక్ షాపులు, బ్రాహ్మణ కార్పొరేషన్ క్రింద 11 యూనిట్లు, 3 జనరిక్ మందుల షాపులు, కాపు(బలిజ) కార్పొరేషన్ క్రింద 345 యూనిట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. మొత్తం మీద రాష్ట్ర వ్యాప్తంగా 2004 యూనిట్లకుగాను రూ.42.86 కోట్లు, , 62 జనరిక్ మందుల షాపుల కొరకు రూ.4.96 కోట్లు సబ్సిడీ రుణాలుగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

03ATP29_03ATP29.qxd 29-01-2025 PM 11:31 Page 1



# 5 నుండి శ్రీ కొండమీదవెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు

బుక్కరాయసముద్రం, జనవరి 29 ప్రభాతవార్త

శ్రీ కొండమీదవెంకటరమణస్వామి స్వయంగా వెలసిన స్థానం దేవర కొండ అగ్రభాగం భక్తుల కోరికను తీర్చు కల్పతరువుగా, అనాధరక్షకు డుటగా, ఆర్తత్రా ణపరాయణుడుగా వెలసినస్వామియే ఈ కొండమీద రాయుడు ,కొండలలో నెలకొన్న కోనేటిరాయుడు ఆ తిరుమల శ్రీనివాసుడు, దేవర కొండపై నెలకొన్న కోనేటిరాయుడు ఈ కొండమీద రాయుడు, అనేక వందల సంవత్సరాల నుండి ఈ స్వామికి ఉత్సవములు ,నిత్యపూజలు జరుగు తున్నట్లు స్థానిక ప్రజల వలన తెలుస్తూంది. ఇది అనంతపురం జిల్లా మం డల కేంద్రమైన బుక్కరా యసముద్రం గ్రామానికి సుమారు 2 కిలో మీ టర్లు దూరంలో దేవరకొండ ఉంది. దేవర కొండ శిఖరభాగాన పుట్టశిలకే వెల సిన స్వామి కొంమీదరాయుడు .శ్రీ లక్ష్మిసహిత వేంకటేశ్వరుడే కొండ మీద నెలకొన్నాడు. కాబట్టి కొండమీద రాయుడుగా భక్త జనావళిచేత పూజింపబడుతు న్నాడు. శ్రీవారికి యేటేట రథోత్సవం ఇతర ఉత్సవాలు దాదాపు 9రోజులు జరుగుతాయి ప్రతి సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి రోజున రథోత్సవం జరుగుతుంది. మాఘ శుద్ధ అష్టమి నుండి బహుళ విధియ వరకు ఒక్కోరోజు ఒక్కొక్క వాహనం పై అధిరోహింపచేసి స్వామి వారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగిస్తారు. పూర్వం ఈ దేవరకొండమీద గార్గేయ మహర్షి తపస్సు చేసినాడనీ ఆయన నిరంతరం తపఃఫలముగా శ్రీ వేంకటేశ్వస్వామి ప్రత్యక్షమై ఆయన కోర్కెలను తీర్చినా డనీ, ఈ కొండమీదనే స్థిరంగా నిలిచిపోయినాడనీ ప్రతీతి శిలారూ పంలో వున్నస్వామి భక్త పరాధీనుడు మనకు నిరంతరం సాక్షాత్కరిస్తున్నట్లు కనిపి స్తుంది. స్వామి వారు వేంచేసి వుండే స్థలానికి వెనుకవైపు ఒక గుహవుంది ఈ గుహ ప్రవేశద్వారం చిన్నగా మొదట కన్పించినా రాను రాను చాలా విశాలంగా వుందనీ ఆ ప్రదేశమంతా మిక్కిలి కాంతివం తంగా విరా జిల్లుతూందని చెబుతా రు. శ్రీవారికి మాఘ మా సాన తొమ్మిది రోజులు జరిగే ఆత్సవాల్లో మొదటి రోజు ఫిబ్రవరి 5 ఉత్సవ విగ్రహాన్ని దేవరకొండ పైకి తీసుకువె ళుతారు, 6న అక్కడే గార్గేయ గృహంలోని మూల విరాట్టుతోపాటు శ్రీ వారికి పుణ్య హవచనం, ధ్వజారోహణం, అంకురార్ప ణం, సవ కలశ స్థాపనం చేసి తర్వాత సాయింకాలం ఉత్సవ విగ్రహాలను బుక్కరాయ సముద్ర గ్రామానికి తీసుకొనివ స్తారు. ఆరోజు జరిపే ఉత్సవం పుష్ప పల్లకసేవ, 7న సింహ వాహనం, 8 శేషవాహనం, 9 హను మద్వావాహనం, 10 గరుడవాహ నం, 11 శ్వేతగజవా హనం, 12 మాఘశుద్ధ పౌర్ణమి రథోత్సవం, 13 అశ్వ వాహనం, 14 హంసవాహనంతో బ్రహోత్సవాలు ముగుస్తాయి.



దేవరకొండ పై వెలసిన శ్రీ కొండమీదవెంకటరమణస్వామి



కొండపై వెలసిన దేవాలయాలు

# గ్రామాలోని ప్రతి ఇంటికి టాయిలెట్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి

## పంచాయితీ కార్యదర్శులకు తెలియజేసిన ఎంపిడిఓ,ఈఓఆర్డి

అనంతపురం రూరల్, జనవరి29ప్రభాతవార్త:

అనంత రూరల్ మండలంలోని గ్రామాలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వ పాశాలకు, అంగన్‌వాడి కేం ద్రాలకు టాయిలెట్లు కలిగి ఉండాలని వాటికి సంబందించిన వివరాలకు చేకరించి ఆ వివరాలను అన్‌లైన్‌లో నమోదు చేయాలని పంచాయితీ కార్యదర్శులకు ఎంపిడిఓ దివాకర్, ఈఓఆర్డి వెంకటనాయుడు తెలియజేశారు. బుధవారం మండల పరిషత్ కార్యాల యంలో వారు పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 16 స్వచ్ఛ భారత్ చెత్త సంపద కేంద్రాలు ఉన్న వాటిని సక్రమంగా వినియోగించుకోలేదని ఈ కేంద్రాలను అన్నింటిని ఫిబ్రవరి15లోపు వినియోగంలోకి తీసుకవచ్చి గ్రామాల్లోని చెత్తను సేకరించి కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామాలోని ప్రతి ఇంటికి, ప్రభుత్వం పాఠశాలకు, అంగన్‌వాడి కేంద్రాలకు పురుషులకు, స్త్రీలకు వేరు వేరు టాయిలెట్లు ఉండే విధంగా చూడాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో ఎక్కడ డ్రైనేజి నీరు నిలువ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ ప్లాస్టిక్ వేయకుండా రద్దు చేయాలన్నారు. చెత్త సంపద కేంద్రాలలో ఎక్కడైన క్లాప్ మిత్రలు లేని చోటును గురించి అక్కడ క్లాప్ మిత్రను నియమి ంచాలన్నారు.

అలాగే గ్రామాల్లో ఎప్పటికి అప్పుడు చెత్తను శుభ్రం చేయించి పరిసరాలను పరిశుభ్ర ంగా ఉంచి ప్రజల ఆరోగ్యంను కాపాడాల న్నారు. 2024-25 ఆర్థిక సం వత్సరం మార్చితో పూర్తి కావడం జరుగుతుండంతో మండలంలో పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల పన్నుల వసూలను వేగవంతం చేసి వందశాతం వసూలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్య దర్శులు అశోక్‌బాబు, హిదయతుల్లా, బాబా ఫకృద్దీన్, మహమ్మద్ రఫి, రవిచంద్ర, శ్రీధర్‌రావు, ప్రవీణ్‌బాబు, గోవింద్‌రాజులు, మల్లికార్జున, హైమావతి, పద్మావతి, ప్రవీణ్ కుమార్, పవన్ కుమార్, మహేశ్వరరెడ్డి, గ్రేడ్5 పంచాయితీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



పంచాయితీ కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం.

# అంగన్‌వాడీ పాలిట దేవుడు సిఎం చంద్రబాబునాయుడు

కూడేరు, జనవరి 29 ప్రభాతవార్త

మరణించిన అంగణ్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం పదివేల మంజూరు చేస్తూ ఉత్తర్వులు జిఓ ఎంఎస్ నెంబర్ విడుదల చేసిన సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కార్యకర్తల వేతనం 2014లో 4,500లకు, 2016లో 7వేలకు, 2018లో 10,500లకు, అంగన్‌వాడీ సహాయకులకు 2014లో 2200లకు, 2016లో 4,500లకు, 2018లో 6వేల రూపాయలకు పెంచిన ఘనత సీఎం చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు.

పెంచిన జీతాలతోపాటు ఆనాడు ఎన్టీఆర్ వైద్య సేవ, చంద్రన్న భృమా పథకాలు కూడా వర్తింప చేశారు. ఇంతగా అంగన్‌వాడీ కుటుంబాల గురించి ఆలోచించే చంద్రబాబు మరలా ఇప్పుడు సర్వీసులో మరణించిన అంగన్‌వాడీ వర్కర్ల, హెల్పర్ల అంత్యక్రియలకు రూ.15వేలు ఇచ్చేందుకు జీవో విడుదలచేసి చరిత్రలో నిలిచి మా పాలిట దేవుడయ్యారన్నారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన వారిలో శ్యామల, నాగలక్ష్మి, కళావతి కుమారి, ఆయాలు లీలావతి, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చంద్రబాబునాయుడుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

# విద్యాశాఖలో దళిత మహిళ టీచర్ మహేశ్వరి పోస్టింగ్‌పై తీవ్ర కుల వివక్షత

## - ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు, ప్రజా సంఘాలు ధ్వజం

అనంతపురం న్యూటౌన్, జనవరి 29 ప్రభాతవార్త

నగరంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్లఓ బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు నెరమెట్ల ఎల్లన్న మాట్లాడుతూ.. గత ఆరు నెలలుగా దళిత మహిళ ఉపాధ్యాయురాలు వి.మహేశ్వరి స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ సైన్స్‌కు పోస్టింగ్ ఇవ్వడంలో అనంతపురం జిల్లా విద్యాశాఖ అధికారులు కుల వివక్షత చూపించడం దారుణమని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వెంటనే అనంతపురం దగ్గరలో పోస్టింగ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లా సమగ్ర శిక్ష ఆఫీసులో జిసిడిఓగా పనిచేసే మాత్ర సంస్థకు రిపోర్ట్ చేసుకొని ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ జిల్లా విద్యాశాఖ అధికారి పోస్టింగ్ ఇవ్వకుండా నిర్లక్ష్యంగా దళిత మహిళ అనేటువంటి చులకన భావంతో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు కుల వివక్షత చూపుతూ, తన కులస్తులకు చట్టాలు, రూల్స్ పక్కన పెట్టి పని చేస్తూ వీరికి వర్తించిన చట్టాలు దళిత మహిళ టీచర్ మహేశ్వరికు చట్టం రూల్స్ అని చెప్పి గత ఆరు నెలలుగా పోస్టింగ్ ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తూ, కుల వివక్షతకు కారణమైన జిల్లా విద్యాశాఖ అధికారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కింద కేసు నమోదు చేసి అనంతపురం జిల్లా నుంచి జిల్లా విద్యాశాఖ అధికారిని బదిలీ చేయాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్ర మాలు చేపడుతామని హెచ్చరిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ సభ్యులు సాకే చిరంజీవి ఎస్సీ, ఎస్టీ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీనుగ రామాంజినేయులు, మాదిగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకులు సాకే రామ తీర్థ, జిల్లా ప్రధాన కార్యదర్శి సంజీవరాయుడు, ఎమ్మార్పిఎస్ జిల్లా అధ్యక్షులు వైఎస్ రమేష్, ఎమ్మార్పి ఎస్ శింగనమల నియోజకవర్గం ఇన్‌చార్జ్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడతున్న జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యులు నెరమెట్ల ఎల్లన్న

# ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మొదటిరోజు మొదలైన ఆమరణ నిరాహార దీక్ష

అనంతపురం న్యూటౌన్, జనవరి 29 ప్రభాతవార్త

నగరంలోని కలెక్టరేట్ ఎదుట ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆవరణ నిరాహార దీక్షక్ష బుధవారం ప్రారంభమైంది. సందర్భంగా పిఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ప్రతిభ భారతి, ఎఐఎస్‌పి రాష్ట్ర ఉపాధ్యక్షు నరసింహా, ఎఐఎస్ రాష్ట్ర కన్వీనర్ నిరంజన్ యాదవ్, ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు గోగుల మూర్తి నాయకులు మాట్లాడుతూ.. అనంతపురం పట్టణంలో సోమలదొడ్డి వద్ద ఉన్న ఓ కార్పోరేట్ జూనియర్ కళాశాలలో విద్యార్థి ఫీజుల ఒత్తిడి వల్ల మరణించి వారం రోజులు గడుసున్న అధజకారులు నిద్రమత్తులో ఉన్నారు. సమస్య పరిష్కరించమంటే చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

దానికి నిరసనగా పిఎస్ఎఫ్ఐ, ఎఐఎస్‌పి, ఎఐఎస్ఓ, ఎస్సీ, ఎస్‌టి, బిసి, మైనార్టీ జెఎసి ఆధ్వర్యంలో ఆమరణ నిరాహార దీక్ష ఆఫీస్ ఎదుట మొదటి రోజు మొదలైంది. అయినా అధి.కారులు వారి నిద్ర మత్తు వదలలేదు, ఎవరు స్పం ది ంచక పోయి నా మసమస్య పరిష్కారం అ య్యే ంత వరకు దీక్ష విరమిం చేది లేదని అధికా రులను హెచ్చరించారు. నీ కార్యక్రమంలో ఐక్య విద్యార్థి సం ఘాల నాయకులు మౌనిక, పార్వతి , దివ్య, గంగాధర్, ఆదర్శ్, హోం నాథ్, విక్రమ్, బన్నీ, విశ్వ, బాలు, సు బ్బు, ఈశ్వర్, గాని నవీన్, పవన్, చిన్న, హరి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.





ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

# ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యపరిచే ప్రభుత్వ విధానాలపై ఉద్యమిస్తాం

## - ఏపిటిఎఫ్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 29 ప్రభాతవార్త

ఉపాధ్యాయ భవన్‌లో నిర్వహించిన పత్రికా సమావేశంలో జిల్లా శాఖ అధ్యక్షులు రాయల్ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.సిరాజుద్దీన్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.నర్సింహులు మాట్లాడుతూ.. ప్రభుత్వ జీఓ నవంబర్ 117 రద్దు స్థానంలో చేపడుతున్న ప్రక్రియని తీవ్రంగా ఖండిస్తూ గత ప్రభుత్వం గ్రామీణ విద్యా రంగాన్ని విచ్ఛిన్నం చేసిన జీఓ నెంబర్ 117తో వేలాది పాఠశాలలో మూతబడి గ్రామీణ విద్యా రంగం విచ్ఛిన్నం కాగా ప్రస్తుత ప్రభుత్వం మెమో పేరుతో అంతకన్నా తీవ్ర నష్టాన్ని మోసుకొస్తున్న ప్రత్యామ్నాయ విధానంతో ఉన్నటువంటి ప్రాథమిక పాఠశాలను కూడా ఆదర్శ ప్రాథమిక పాఠశాలల పేరుతో సుధీర ప్రాంతంలోని గ్రామీణ పాఠశాలలో 3, 4, 5 తరగతులు చదువుతున్న విద్యార్థులు ఆదర్శ పాఠశాలలకు వెళ్లలేక వేలాదిగా డ్రాప్ ఔట్స్‌కి గురై వీధిన పడే ప్రమాదం లేకపో లేదని దీనితో పాఠశాల విద్య మరింత నిర్వీర్యమవు తుందే తప్ప బాగుపడే సూచన లేవన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు సతీష్‌కుమార్, నరేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సర్దార్ వలి, జిల్లా రాష్ట్ర కౌన్సిలర్ వెంకటరమణ, ఆడిట్ కన్వీనర్ వన్నప్ప, నాయకులు రామ్మూర్తి హనుమంతు హిమగిరి ప్రసాద్, ఫకృద్దీన్, నస్రుల్లా రజాక్ తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న ఏపిటిఎఫ్ నాయకులు

# బిసి కార్పోరేషన్ రుణాలు దరఖాస్తుకు షెడ్యూల్ విడుదల

## - నేటి నుంచి ఓబిఎంఎంఎస్ వెబ్‌సైట్లు దరఖాస్తు ఆహ్వానం - బిసి కార్పోరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం వెల్లడి

అనంతపురం న్యూటౌన్, జనవరి 29 ప్రభాతవార్త

బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీ ఆదేశాల మేరకు బిసి/ఈబిసి/కమ్మ/రెడ్డి/క్షత్రియ/వైశ్యా/బ్రాహ్మణ, కాపు (బలిజ) కులాల వారు 2024-25 ఆర్థిక సంవత్సరమునకుగాను (1), స్వయం ఉపాధి పథకం (బిసి/ఈబిసి/కమ్మ/రెడ్డి/క్షత్రియ/వైశ్యా/బ్రాహ్మణ, కాపు (బలిజ) కులముల వారికి జనరిక్ మెడికల్ షాపులు కోసం ఎపిఓబిఎంఎంఎస్ వెబ్ సైట్‌లో ఈ నెల 30వ తేది నుంచి ఫిబ్రవరి 7వ తేది వరకు దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం అవకాశ: కల్పించినట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా బిసి కార్పోరేషన్ ఈడి సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం జిల్లాకు సంబంధించి స్వయం ఉపాధి రుణాలు 2297 యూనిట్లు, జనరిక్ మెడికల్ సాపులు ఏర్పాటుకు 72 యూనిట్లు మంజూరు కావడం జరిగిందన్నారు. అదే విధంగా శ్రీ సత్యసాయి జిల్లాకు సంబంధజంచి స్వయం ఉపాధి రుణాలు 2004 యూనిట్లు, జనరిక్ మెడికల్ సాపులు ఏర్పాటు కోసం 62 యూనిట్లు మ ంజూరు కావడం జరిగిందన్నారు. కావున ఉమ్మడి అనంతపురం జిల్లాలోని అర్హత కలిగిన లబ్దిదారులు సంబంధిత సర్టిఫికెట్లతో గడువులోపు ఓబిఎంఎస్ వెబ్‌సైట్‌లో రుణాలు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

# దేవరకొండ పైకి 100 వీధి దీపాలు ఏర్పాటుచేసిన మేజర్ పంచాయితీ సర్పంచు పార్వతి

బుక్కరాయసముద్రం, జనవరి 29 ప్రభాతవార్త

బుక్కరాయసముద్రం మం డల కేంద్రంలోని దేవరకొండ పై వెలసిన శ్రీ కొండమీదవెం కట రమణస్వామి బ్రహ్మోత్స వాలు ఫిబ్రవరి 5తేదినుండి ప్రారం భం కానున్నాయి ఈ సందర్భ ంగ గ్రామ సర్పంచు ఎ.పార్వతి 100 వీధి దీపాలను ఆలయ అభివృద్ధి కమిటి సభ్యులు శ్రీనా థ్, చందు, నారాయణ స్వామి, ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రంలో వారితోపాటు యుఒఆర్డి సదాశివా, మాజి సర్పంచు లక్ష్మినారాయణ, పంచా యితీ కార్యదర్శి సర్దార్ తదితిరులు పాల్గొన్నారు.



వీధి దీపాలను అందజేస్తున్న సర్పంచు పార్వతి

# సంక్రాంతి ప్రత్యేక బస్సుల ఆదాయంపై సమీక్ష

## - ఆర్టీసి రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆదోని

అనంతపురం కలెక్టరేట్, జనవరి 29 ప్రభాతవార్త

ఏపిఎస్ఆర్టీసి రీజనల్ మేనేజర్ కార్యాలయంలో బుధవారం అనంతపురం జిల్లాలోని డిపో మేనేజర్లతో సమీక్షా సమావేశాన్ని రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆదోని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన సంక్రాంతి సందర్భంగా తిప్పిన ప్రత్యేక బస్సు సర్వీసులను సమీక్షించారు. గత ఏడాది లాగే ఈ ఏడాది ప్రత్యేక బస్సులు బాగా నడిపారు. ఈ సర్వీసుల ఆదాయం పెరిగినందుకు అధికారుల కృషిని ప్రశంసించారు. ఇక ముందు కూడా ఇలాగే కృషి చేయాలని తెలియచేశారు. ఈ సమీక్షలో రేపటి నుండి రానున్న మాఘమాసంలో ప్రయాణీకులు చాలా వరకు పెళ్లిళ్లకు, దేవాలయాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతారని వారి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో వుండే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన డిపో మేనేజర్లకు సూచించారు. ప్రతి బస్సు సర్వీసు యొక్క పనితీరును, బస్ షెడ్యూల్ టైమింగ్స్‌ను పరిశీలించిన రీజనల్ మేనేజర్ బస్సులు ఎల్లప్పుడూ ప్రయాణీకులకు సౌకర్యవంతంగా సమయానుగుణంగా వుండేలా చేయాలని, సెక్టర్ వారిగా బస్ సర్వీసు యొక్క పనితీరు సమీక్షించి పనితీరు బాగా లేని సర్వీసులను పరిశీలించి రీ షెడ్యూల్ చేయాలని సూచించారు. రీజనల్ మేనేజ ర్ ప్రమాదాల నివారణకై డ్రైవర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే అన్ని డిపోల్లో ప్రమాదాల నివారణకై జనవరి 16 నుండి ఫిబ్రవరి 15 వరకు జరుగు ప్రమాద రహిత మాసోత్సవంలో డ్రైవర్లు అందరికి అవగాహన కల్పించాలని ప్రమాదాలు జరుగు ప్రదేశాలను గుర్తించి అక్కడ జాగ్రత్తగా, అప్రమత్తంగా బస్సును నడిపి సురక్షితంగా ప్రయాణాన్ని అందించడమే ధ్యేయంగా డ్రైవర్లు, కండక్టర్లు పనిచేయాలని సూచించారు. మెకానికల్ విభాగంను పరిశీలించి, సమీక్షించిన రీజనల్ మేనేజర్ కెఎంపిఎల్‌ని పెంచాలని, బ్రేక్ డౌన్ తగ్గించి ప్రయాణీకులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడమే ధ్యేయంగా పనిచేయాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటి సిటిఎం కె.శ్రీలక్ష్మీ, అనంతపురం జిల్లాలోని డిపో మేనేజర్లు పి.నాగభూపాల్, ఈఎల్ శంకర్, కె.రామచంద్ర, జె.శ్రీనివాసరావు, కెవి గంగాధర్, ట్రాఫిక్ ఇన్‌చార్జులు వి.రమణమ్మ, ఆర్‌వి ప్రసాద్‌బాబు, ఆర్ఎం ఆఫీస్ ఎస్‌టిఐఎం నాగార్జున పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసి రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్.ఆదోని

# ముగిసిన స్క్రిప్ట్ రైటింగ్ శిక్షణా తరగతులు



శిక్షణాకార్యక్రమాలు నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం ఓల్డ్ టౌన్ జనవరి 29 ప్రభాతవార్త

అనంతపురం ఫిల్మ్ సొసైటీ ఆధ్వర్యంలో జరుగుచున్న 7వ అనంత షార్ట్ ఫిల్మ్ ఫెస్టివల్ లో భాగంగా 28, 29 రెండు రోజుల పాటు జరిగాయి. హైదరాబాద్ కు చెందిన దుర్గా రమేష్ స్క్రిప్ట్ రైటింగ్ లో గల మెలకువలు గురించి లోతుగా శిక్షణాకార్యక్రమాలను తీసుకున్నారు. సదస్సు లో పాల్గొన్న వారి చేత 12 కథలను రాయించారు. వాటిలో నుంచి ఒక కథకు గాను జి యం యస్ గ్యాలరీ ఫిల్మ్ జి యం సురేష్ 50,000/ బడ్జెట్ తో లఘు చిత్రాన్ని నిర్మించాడని సిద్ధంగా ఉన్నట్లు తెలియజేశారు. పూర్తి వివరాలను 2వ తేదిన జరుగు లఘు చిత్రాల అవార్డు కార్యక్రమంలో తెలియజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిల్మ్ సొసైటీ సభ్యులు కంబదూరి షేక్ నబీ రసూల్ , తోట బాలన్న, యాంకర్ రమేష్, టీవీ రెడ్డి, గోపాల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల



సెమిస్టర్ ఫలితాలను విడుదల చేస్తున్న దృశ్యాలు

అనంతపురం అర్బన్, జనవరి 29 ప్రభాతవార్త

స్థానిక కెఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ బాలికల కళాశాల (స్వ యం ప్రతిపత్తి) డిసెంబ ర్‌లో నిర్వహించిన మొదటి సెమి స్టర్ పరీక్ష ఫలితాలను ఎస్కే యూనివర్సిటీ రిజిస్టర్ రమేష్‌బాబు, డైరెక్టర్ ఆఫ్ ఈవాల్యూషన్‌ప్రొ ఫెషనల్ జివి రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ సిలోకేష్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కెసి సత్యలత బుధవారం మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. 647 మంది విద్యార్థి నులు పరీక్షలు రాయగా అందులో 584 మంది (90.26 శాతం) ఉత్తీర్ణు లయ్యారు. బిఏ (ఆనర్స్)లో 92 మందికి 79 మంది బికాం(ఆనర్స్)లో 226 మందికిగాను 198 మంది బిఎస్సీ (ఆనర్స్)లో 300 మందికిగాను 284 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఫలితాలను గురువారం కళాశాల వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. రివా ల్యూయేషన్, పర్సనల్ వెరిఫికేషన్ సంబంధించి, ఫిబ్రవరి 6 తారీఖు తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. రీ వాల్యూయేషన్ 300 పర్సనల్ వెరిఫికేషన్‌కి 600 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్ర మంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ హెచ్ఎస్ శివశంకర్, అసిస్టెంట్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ రమణనాయుడు, రామలింగారెడ్డి, బి.రామ కృష్ణ, అంజనరెడ్డి, తిమ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 76వ గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బెస్ట్ ఎన్‌సిసి కంటిజెంట్ అవార్డు



బెస్ట్ ఎన్‌సిసి కంటిజెంట్ అవార్డు పొందిన ఎన్‌సిసి విద్యార్థులు

అనంతపురం న్యూటౌన్, జనవరి 29 ప్రభాతవార్త

6(ఎ) బెటాలియన్ కమాండి ంగ్ ఆఫీసర్ కులకర్ణి, ఎస్ఎస్ బిఎన్ డిగ్రీ కళాశశాల, ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల, ఐటిఐ కళాశాల కు చెందిన ఎన్‌సిసి క్యాడె ట్‌ల తోపాటు ఎన్‌సిసి అధికా రులు మురళీ, రామాంజి నేయులు, జగదీష్‌లు విజేతలు గా నిలిచి నందుకు సగర్వంగా అభినందిం చారు. 76వ గణత ంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా బెస్ట్ ఎన్‌సిసి కంటిజెంట్ అవార్డు వారి విశేషమైన అంకితభావం, క్రమశిక్షణ, శ్రేష్టత పట్ల నిబద్ధత ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో గుర్తించబడ్డాయి. క్యాడెట్‌ల కృషి, జట్టుకృషి వారి సంస్థలకు, జిల్లాకు ఎనలేని గర్వాన్ని తెచ్చిపెట్టింది. ఈ గుర్తింపు ఐక్యత, నాయకత్వం, దేశానికి సేవ యొక్క విలువలను సమర్ధించడంలో ఎన్‌సిసి క్యాడెట్‌ల నిరంతర ప్రయత్నాలను నొక్కి చెబుతుందన్నారు.

# నేటి సబ్సిడి రుణాలకు దరఖాస్తు చేసుకోండి

శింగనమల, జనవరి 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని బిసి, ఈ బిసి, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య, బ్రాహ్మణ, కాపు, బలిజ కులాలకు చెందిన వారు సబ్సిడి రుణాల కు దరఖాస్తు చేసుకో వాలని ఎంపిడిఓ నిర్మలా కుమారి బుధవారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం సబ్సిడి రుణాల మంజూరు చేసింని, జనరిక్ మెడికల్ షాపులు బిఫార్మసీ, డి ఫార్మసీ చేసిన బిసి, ఇబిసి నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించింది. కావున ఏపిఓ బి.ఎంఎంఎస్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, 30 వతేది నుంచి 07-02-2025 వరకు అవకాశం ఉందని అర్హత కలిగిన లబ్ధిదారులందరూ దరఖాస్తు చేసుకోవాలని, సంబంధిత గ్రామ సచివాలయాలలో, మీ సేవాలో దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని దీనిని వినియోగించుకోవాలని వారు కోరారు.



ఎస్ఎంఎల్01 : ఎంపిడిఓ నిర్మలకుమారి

